

పంట నష్టం

ఎండ, అకాల వర్షాలు రైతులను కలవరపె డుతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వానకు పంటలు దెబ్బతింటున్నాయి. 8లో▸



ఓటుతోనే మార్పు సాధ్యం

ఓటుతోనే మార్పు సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. 8లో▸



వైభవంగా గిరి ప్రదక్షిణ

పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో మంగళవారం గిరిప్రదక్షిణ వేడుక శోభాయమానంగా సాగింది. 9లో▸

న్యూస్‌రీల్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. పెళ్లి ముహూర్తం కోసం కుటుంబ సభ్యులు పూజారులు, పాస్టర్స్, ఖాజీల వద్దకు వస్తుంటారని, వధూవరుల డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ చూసి అమ్మాయి వయస్సు 18, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు ఉంటేనే ముహూర్తం పెట్టాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు ఈ విషయంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కళాశాలలు, పాఠశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేసి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. జిల్లాలో గత ఏడాది 138 బాల్య వివాహాలు జరిగాయని, చాలా వరకు అడ్డుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ మాట్లాడారు. బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత అన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, జిల్లాలోని పూజారులు, పాస్టర్స్, ఖాజీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీవి సాధ్యం కాని హామీలు

- బీజేపీని గెలిపించేందుకు చేవెళ్ల ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- లోక్‌సభ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తాండూరులోని ఎంపీటీ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నియోజకవర్గ బూత్ స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలకు మరో 20 రోజుల సమయమే ఉన్నందున నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పులు చేసి బీజేపీపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని పిలుపునిచ్చారు. తాండూరులో బీజేపీ మొదటి స్థానంలో, కాంగ్రెస్ మూడో స్థానంలో నిలవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇక నుంచి తాను పూర్తిగా రాజకీయాల్లో కొనసాగుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్, రాష్ట్ర మహిళా కార్యవర్గ సభ్యులు సాహు శ్రీలత, మున్సిపల్ కౌన్సిలర్ లలిత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి వెంకట్, నాయకులు సుదర్శన్‌గౌడ్, శివకుమార్, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్ కుల్కర్ణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని మోదీ సంక్షేమ పథకాలు అమలు చేశారని చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాదరణ బీజేపీకే ఉందన్నారు.

నాగర్‌కర్నూల్‌లో మల్లురవి నామినేషన్

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణరావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు అందించారు.



అనంతగిరి: వికారాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర

నేత్రపర్వం.. హనుమాన్ శోభాయాత్ర

జిల్లాలో మంగళవారం హనుమాన్ జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. – అనంతగిరి



తాండూరు టౌన్: హనుమాన్ శోభాయాత్రలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

సెల్‌ఫోన్ల రికవరీ సులభతరం

'సీఈఐఆర్'తో పోయిన ఫోన్లను తిరిగి పొందొచ్చు

- కొత్త టెక్నాలజీతో సెల్‌ఫోన్ దొంగల ఆటకట్టిస్తున్న పోలీసులు
- ఏడాదిలో చోరీకి గురైన ఫోన్లు 258
- 50 రికవరీ, బాధితులకు అప్పగింత



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి(ఫైల్)

వికారాబాద్: మనిషి జీవితంలో సెల్‌ఫోన్ భాగమైపోయింది. గ్రామీణ ప్రాంతాలు మొదలుకొని పట్టణాల వరకు వీటి వాడటం సర్వ సాధారణమైపోయింది. 50 శాతానికిపైగా స్మార్ట్ ఫోన్లనే వాడుతున్నారు. ప్రధానంగా 90 శాతం మంది యువత వీటిని వినియోగిస్తున్నారు. ఒక్కో ఫోన్ కోసం రూ.10 వేలు మొదలుకొని లక్ష దాకా వెచ్చిస్తున్నారు. ఇదే సమయంలో సెల్‌ఫోన్ల దొంగలు కూడా ఎక్కువయ్యారు. ఐదారేళ్లుగా ఫోన్ దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. రోజురోజుకూ సైబర్ బాధితులు పెరిగిపోతున్నారు. సెల్‌ఫోన్ దొంగల ఆట కట్టించడంతోపాటు పోగొట్టుకున్న వాటిని రికవరీ చేసేందుకు కేంద్ర టెలీకామ్ మంత్రిత్వ శాఖ నూతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా జిల్లా పోలీసు విభాగం మంచి పురోగతి సాధిస్తోంది. తాజాగా జిల్లాలో పోగొట్టుకు పోయిన 50 సెల్ ఫోన్లను సీసీఎస్ పోలీసులు రికవరీ చేశారు. ఎస్పీ చేతుల మీదుగా వాటిని బాధితులకు అందజేశారు.

సంతల్లో చోరీలు

జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో గడిచిన ఏడాది కాలంలో 258 ఫోన్లు చోరీకి గురయ్యాయి. కొన్ని చోట్ల బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా, మరికొన్ని చోట్ల సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, మోమిన్‌పేట్, మర్పల్లి పట్టణాల్లో జరిగే సంతల్లో ఎక్కువగా సెల్ ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. ఈ ప్రాంతాలను పోలీసులు హాట్ స్పాట్లుగా గుర్తించారు. జిల్లాలో చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ బాధ్యతను ఎస్పీ కోటిరెడ్డి జిల్లా సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. సీఈఐఆర్ టెక్నాలజీని వినియోగించి రూ. 8,36,061 విలువ చేసే 50 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. వికారాబాద్ సబ్ డివిజన్‌లో 21, పరిగి సబ్ డివిజన్‌లో 19, తాండూరు సబ్ డివిజన్‌లో 10 ఫోన్లు రికవరీ చేశారు.

పొరుగు రాష్ట్రాల్లో స్వాధీనం

జిల్లాలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటక ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం పక్క రాష్ట్రాలకు చెందిన 12 నుంచి 14 ఏళ్లలోపు వారేనని పోలీసులు గుర్తించారు. ఏపీలోని కర్నూల్ జిల్లా డోన్ తదితర ప్రాంతాలకు చెందిన పిల్లలను సంతల్లో సెల్‌ఫోన్ చోరీలకు పంపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని పట్టుకోవడానికి నిఘా ఉంచినట్లు తెలిసింది.

ఫోన్ పోతే ఏం చేయాలి

ఎవరైనా సెల్‌ఫోన్‌ను దొంగిలించినా.. ఎక్కడైన పోగొట్టుకున్నా, పొరపాటున పడిపోయినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం మూడు పద్ధతులు ఉన్నాయి. బాధితుడు తన ఫోన్ ద్వారా www.ceir.gov.in వెబ్ సైట్‌లో సీఈఐఆర్ పోర్టల్‌లో, లేదా మీ–సేవా కేంద్రంలో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఈ రెండు కాకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. సెల్‌ఫోన్ ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) నంబర్, సిమ్ నంబర్, ఫోన్ కొన్న సమయంలో ఇచ్చే బిల్, అడ్రస్ తదితర వివరాలను ఇందులో పొందుపరచాల్సి ఉంటుంది. మనం సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసింది మొదలు ఆ ఫోన్ స్టేటస్ చూసుకోవటానికి వీలుంటుంది. దాన్ని ఎవరు, ఎక్కడ వాడుతున్నారు.. అసలు వాడుతున్నారా..? లేదా..? అదే నంబర్‌తో వాడుతున్నారా..? వేరే నంబర్ వేసుకున్నారా..? లాంటి వివరాలు తెలుసుకోవచ్చు. సీఈఐఆర్ టెక్నాలజీతో పోలీసులు ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారు.

ఎక్కడున్నా దొరికిపోతారు

సీఈఐఆర్ టెక్నాలజీతో దొంగిలించిన ఫోన్లు ఎక్కడున్నా కనిపెట్టేందుకు వీలవుతుంది. కొందరు ఆచూకీ దొరకకుండా ఉండడానికి దొంగిలించిన ఫోన్లను స్పేర్ పార్టులుగా మార్చి విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల పాడైన ఫోన్ ఐఎంఈఐ నంబర్ దొంగిలించిన ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసి వాడుతున్నారు. అయితే ఫోన్ ఏ రూపంలో ఉనా.. ఎక్కడ ఉన్నా గుర్తించటానికి వీలవుతుంది.

రికవరీ చేస్తాం



సెల్‌ఫోన్ దొంగలు దొరకడం కొంత ఆలస్యం కావచ్చు.. ఫోన్లు మాత్రం కచ్చితంగా దొరికే అవకాశం ఉంది. ఈ విషయం తెలియక చాలా మంది చోరీలకు పాల్పడుతున్నారు. సీఈఐఆర్ టెక్నాలిజీ గురించి అందరికీ తెలిస్తే దొంగిలించటం మాట అటుంచితే ఎక్కడ ఫోన్ దొరికినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడం ఖాయం.

– బల్వంతయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్, వికారాబాద్

ఓటుతో బుద్ధి చెప్పండి

- రైతులకు అన్యాయం చేసి ఓట్లు అడుగుతారా?
- బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణపై సీఎం రేవంత్ ఫైర్
- మద్దూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం

కొడంగల్: ఈ ప్రాంత రైతులకు మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ తీరని అన్యాయం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నారని విమర్శించారు. అన్యాయం చేసిన ప్రాంతానికి వచ్చి ఓట్లు అడుగుతున్నారని దుయ్యబట్టారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గం మద్దూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పాలమూరులో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని ఓడించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గంలో తనకు 33 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందని, ఎంపీ అభ్యర్థికి 50వేల మెజారిటీ రావాలని కార్యకర్తలకు సూచించారు. సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ ఓడిపోతే రేవంత్ ప్రాబల్యం తగ్గుతుందని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారని, వారి ఆటలు సాగవన్నారు. బీజేపీ మతం, కులం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రజలు ఇలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి 50 వేల మెజారిటీ వస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్ వస్తుందన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీలో వస్తాయన్నారు. 60 ఏళ్ల క్రితం కొడంగల్‌కు మంత్రి పదవి వరించిందని, ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి పదవి తోపాటు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడు అయ్యే అవకాశం దక్కిందన్నారు. తాను గెలిచిన వంద రోజుల్లోపే నియోజకవర్గంలో రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కొడంగల్‌ను, పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. వందేళ్ల సరిపడా అభివృద్ధి జరుగుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమలు రాలేదన్నారు. నియోజకవర్గానికి ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కొడంగల్ మండలంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేసినట్లు చెప్పారు. కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ హాస్పిటల్‌గా మారుస్తున్నట్లు చెప్పారు. కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొడంగల్‌లో ఆర్అండ్‌బీ అతిథి గృహానికి రూ.6 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు, పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం మద్దూరు మండలం బావోజీ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో లోక్‌సభ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న రాహుల్ శర్మ

దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతగిరి: ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండరాదని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో మాట్లాడారు. ఫాం – 6, 8 తోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఫారం – 12ను పూర్తి చేసి పంపాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా చూడాలన్నారు. వికారాబాద్‌కు సంబంధించి 10,494, తాండూరుకు సంబంధించి 19,199, కొడంగల్‌కు సంబంధించి 17,738, పరిగికి సంబంధించి 18,523 ఎపిక్ కార్డులు వచ్చాయని తెలిపారు. పోస్టల్ శాఖతో సమన్వయం చేసుకుంటూ మూడు రోజుల్లో ఓటరుకు చేరేలా ఏఆర్ఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ఆర్డీఓలు వాసుచంద్ర, శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీకి చర్యలు

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గురువారం నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో పనిచేసే సెక్టరోల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ ఓటర్ స్లిప్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బూత్‌స్థాయి అధికారులు బాధ్యతగా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని ఆదేశించారు. వికారాబాద్ నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. 1,136 సిబ్బంది విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ఎన్నికల పర్యవేక్షణకు 26మంది సెక్టోరల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం ఉండాలని, వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీరు, టెంట్లు సమకూర్చుకోవాలని సూచించారు. వయో వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల కోసం వీల్ చైర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించేందుకు అవసరమైన వాహనాలను సమకూర్చాలని జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి జోసెఫ్‌కు సూచించారు. సమావేశంలో వికారాబాద్, బంట్వారం తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

డీఈఓ రేణుకాదేవి



అనంతగిరి: తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు డీఈఓ రేణుకాదేవి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో 654 మంది విద్యార్థులు, ఇంటర్‌లో 1,095 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఇంటర్ పరీక్షల కోసం ఐదు కేంద్రాలు, పదో తరగతి పరీక్షల కోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 9మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 9 మంది డిపార్ అధికారుల తోపాటు 92 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని సిబ్బందికి సూచించారు. ఏ చిన్న తప్పిదం జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

రైతు నేస్తం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి

మొయినాబాద్: వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మొయినాబాద్ రైతు వేదికను మంగళవారం సందర్శించి వీడియో కాన్ఫరెన్స్‌ను పర్యవేక్షించారు. వరిలో నేరుగా విత్తే పద్ధతి, మామిడిలో సస్యరక్షణ చర్యల గురించి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాల్లో రైతులు పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలు తెలుసుకోవాలన్నారు. మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు పండించిన వరి ధాన్యం తీసుకెళ్లి విక్రయించాలన్నారు. వడ్లలో తేమ 17 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓలు కుమార్, సునీల్ పాల్గొన్నారు.

13 మంది.. 14 సెట్లు





నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు రంజిత్‌రెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్

- చేవెళ్ల లోక్‌సభ స్థానానికి నామినేషన్లు దాఖలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా పలువురు స్వతంత్రులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ స్థానానికి మంగళవారం 13 మంది అభ్యర్థులు.. 14 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఇప్పటికే రెండు సెట్లు దాఖలు చేయగా తాజాగా మరో రెండు సెట్లు..మొత్తం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, మరో 11 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు 37 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక వెల్లడించారు.

క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లాలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఏర్పడితే వెంటనే ప్రత్యామ్యాయ ఏర్పాట్లు చేసి తాగునీటి వ్యవస్థకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. మున్సిపల్ పరిధిలో మరియు గ్రామాల పరిధిలో పక్షులకు, పశువులకు నీటి తొట్టెల్లో నీటిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఇంజనీర్లు సంబంధిత అధికారులు తదితరులున్నారు.

ఔట్‌సోర్సింగ్‌లో అవకాశం కల్పించండి

అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మను కోరిన నాగసమందర్ వాసులు



అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ నిర్వహిస్తున్న జేకేఎంఆర్ ఫౌండేషన్‌లో అన్ని కులాలకు చెందిన వారికి ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాగసమందర్ నిరుద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు మంగళవారం అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం సమర్పించారు. బోటింగ్ నిర్వాహకులు కేవలం మా గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులకే ఉపాధి కల్పిస్తున్నారని.. ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు అవకాశం ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తమకు కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని కోరారు.

బార్డర్ చెక్‌పోస్టు పరిశీలన



బార్డర్ చెక్‌పోస్టులో పోలీసులకు సూచనలిస్తున్న లింగ్యానాయక్

కొడంగల్: నియోజకవర్గ సరిహద్దులో ఏర్పాటు చేసిన బార్డర్ చెక్‌పోస్టును అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ మంగళవారం సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టులో బందోబస్తు ఏర్పాటు చేశారు. లోకల్ పోలీసులతో పాటు పారామిలటరీ దళాలను ఉంచారు. జాతీయ రహదారిపై ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అనంతరం ఆయన మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి



గోపాల్(ఫైల్)

పరిగి: ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోశ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రూఫ్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కావలి గోపాల్(47) ఉదయం తన ఆటోలో పరిగి మార్కెట్‌కు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణ కేంద్రంలోని దుర్గా బార్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో గోపాల్ తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆయన్ను పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కోట్‌పల్లి' సామగ్రి దొంగలపాలు



శిథిలావస్థకు చేరిన కోటపల్లి ప్రాజెక్టు కార్యాలయం



గోదాం దుస్థితి

పట్టించుకోని పాలకులు

పెద్దేముల్: కోట్‌పల్లి ప్రాజెక్టు ఇరిగేషన్ సామగ్రి దొంగల పాలవుతోంది. ఈ ప్రాజెక్టు కింద పెద్దేముల్, ధారూరు మండలాల్లోని 19 గ్రామాల రైతుల ఆయకట్టుకు నీరందుతుంది. 1967లో ప్రాజెక్టు నిర్మించినపుడే పెద్దేముల్ మండల కేంద్రంలో కోట్‌పల్లి ప్రాజెక్టు కార్యాలయంతో పాటు ఇరిగేషన్ సామగ్రిని భద్రపరిచేందుకు గోదాంలు, సిబ్బందికి క్వాటర్లు ఏర్పాటు చేశారు. అప్పట్లోనే ప్రాజెక్టుకు సంబంధించిన లక్షల రూపాయల విలువైన సామగ్రి గోదాంలలో భద్రపరిచారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు, కార్యాలయానికి సరైన మరమ్మతులు చేయక.. పాలకులు పట్టించుకోక నిర్లక్ష్యానికి గురవుతోంది. కార్యాలయ భవనం, సిబ్బంది క్వాటర్లు శిథిలావస్థకు చేరాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించడంతో గోదాంలోకి విలువైన సామగ్రి దొంగలపాలవుతోంది. గతంలో ఈ సామగ్రి అధికారులు టెండర్లు సైతం వేశారు. అనంతరం దాన్ని రద్దు చేయడం.. ఎవరూ పట్టించుకోకపోవడంతో లక్షల విలువైన సామగ్రి పక్కదారి పడుతోంది. ఇరిగేషన్ స్థలాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించడంతో సామగ్రిపై దొంగల కన్నుపడింది. మండల కేంద్రంలో ప్రాజెక్టు కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఇదే అదునుగా అధికారులు సైతం పట్టణాలకే పరిమితమయ్యారు. గోదాం నుంచి రేకులు, విలువైన ఇనుప రాడ్స్, షటర్స్, పాణాలు దొంగలించినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో కోటపల్లి ప్రాజెక్టు భవనంతో పాటు విలువైన ప్రాజెక్టు వస్తువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఓటుతోనే మార్పు సాధ్యం

- ఆర్డీఓ శ్రీనివాస్ రావు
- కొత్తగా ఎనిమిది పోలింగ్ కేంద్రాలు మంజూరు

పెద్దేముల్: ఓటుతోనే మార్పు సాధ్యమని.. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండలానికి మంజూరైన నూతన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కందనెల్లి తండాలో గిరిజనులకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. గతంలో తండాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లి ఓటేసేవారని.. ప్రస్తుతం కందనెల్లితండా, మారేపల్లితండా, ఖాజాపూర్, ఊరేంటింతండా, సిద్దన్నమడుగుతండా, ఎర్రగోడుతండా, జైరాంతండా(ఇందూరు), బండపల్లి గ్రామాలకు కొత్త పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు ఉండేలా చూడాలని ఆర్డీఓ ఆదేశించారు. ఇప్పటికే బీఎల్‌ఓలకు ఓటరు ఇంటిమేషన్ అందజేశామని తహసీల్దార్ తెలిపారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ కిషన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, ఎంపీఓ రమేశ్ ఉన్నారు.



కందనెల్లితండాలోని కొత్త పోలింగ్ కేంద్రంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

పాఠశాల మరమ్మతులకు నిధులు

ఎంపీడీఓ పుష్పలీల

యాలాల: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల భవనాల్లో అవసరమైన చోట మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ఎంపీడీఓ పుష్పలీల సూచించారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని బషీర్‌మియాతండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల పనిదినం చివరి రోజు కావడంతో విద్యార్థులకు వేసవి సెలవులు ప్రశాంతంగా గడపాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణ ప్రదేశం, తాగునీటి ట్యాంకు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యం తదితర పనుల నిమిత్తం ప్రతీ పాఠశాలకు రూ.25వేల డీఎంఎఫ్టీ నిధులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆయా పాఠశాలల్లో ఈ పనులను వారం రోజుల్లోగా నిర్వహించుకోవాలని పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ దేవిబాయి, వీఓఏ జ్యోతి, ఐకేపీ సీసీ వెంకటయ్య తదితరులు ఉన్నారు.



పాఠశాలను ఆవరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పుష్పలీల తదితరులు

ఉపాధి కూలి.. పెట్టుబడులకు హామీ

మోమిన్‌పేట: ఉపాధి హామీ కూలీలకు అందిస్తున్న కూలి రైతులకు పెట్టుబడులకు హామీగా నిలుస్తోంది. ప్రతీ జాబ్‌కార్డున్న కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం వంద రోజుల ఉపాధి గ్యారంటీ ఇస్తోంది. మండల పరిధిలోని 28 పంచాయతీల్లో 7,999 మంది కుటుంబాలకు జాబ్‌కార్డులున్నాయి. వీరికి రోజుకు రూ.300 చొప్పున కూలీ ప్రభుత్వం అందిస్తుంది. పొలాల మధ్య మురుగు కాల్వ పనులు, చెరువులోకి నీటి మళ్లింపు కాల్వ తదితర పనులు ఉపాధి పనులు చేపడుతున్నారు. గడిచిన 18 ఏళ్లుగా ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు చేతిలో డబ్బు కనిపిస్తోంది. గతంలో కూలీలు జూన్ మొదటి వారంలో విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లకు దేశీయ బ్యాంకర్లను ఆశ్రయించేవారు. అధిక వడ్డీకి తెచ్చిన డబ్బు తిరిగి పంటలు అమ్ముకున్న తర్వాత వారికే అమ్మేవారు. ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిన తర్వాత రైతులకు ఎరువులకు, విత్తనాలకు కూలీ డబ్బు ఉపయోగపడుతుంది. వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి పనులకు అదనంగా రూ.25వేల వరకు ఆదాయం వస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజుకు కుటుంబానికి అప్పగించిన పనిని సక్రమంగా పూర్తి చేస్తే రూ.600లు గిట్టుబాటు అవుతోందని ఉపాధి అధికారులు అంటున్నారు. కూలీలు సక్రమంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయడం లేదని గతేడాది రోజుకు సరాసరి రూ.201లు మాత్రమే గిట్టుబాటు కూలి లభించిందని ఉపాధి అధికారులు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 616 కుటుంబాలు మాత్రమే వంద రోజులు పూర్తి చేసుకొన్నాయి. కూలీలు వ్యవసాయ పనులు పూర్తిగా లేనప్పుడు ఉపాధి పనులకు వెళ్లడంతో వంద రోజులు పూర్తి చేసుకోలేక పోతున్నారు. ప్రతి జాబ్ కార్డు కల్గిన కుటుంబం వంద రోజులు పనులు వినియోగించుకోవాలని ఉపాధి అధికారులు సూచిస్తున్నారు.



ఎన్కేపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పంచాయతీలు	28
నమోదు చేసుకున్న వారు	12,736
జాబ్‌కార్డులున్నవారు	7,999
హాజరయ్యే వారు	6,891
ప్రస్తుతం హాజరయ్యేవారు	5,870

బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆటంకం

- హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు
- పనులు నిలిపివేయాలంటూ స్టే

తాండూరు: పాత తాండూరు బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పాత తాండూరుకు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రెండు దశాబ్దాలుగా ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రధానంగా పాత తాండూరు బ్రిడ్జి నిర్మాణం చేస్తామంటూ ఎన్నికల హామీగా మార్చుకున్నారు. గతేడాది పాత తాండూరు రైల్వే గేట్‌పై రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించేందుకు నాటి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారు. అందుకు అనుగుణంగానే ఆర్‌యూబీ పనులు చేపట్టాలని అనుకున్నారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బ్రిడ్జి పనులు ప్రారంభించలేదు. గత నెల స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాత తాండూరు రైల్వే గేట్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే రైల్వే గేట్ ఇరువైపులా ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలు అన్ని వంతెన కోసం కూల్చేయాలి. దీంతో రైల్వే గేట్ సమీపంలో ఉన్న మహిళ సూరజ్‌కాంతాసార్దా ఆధ్వర్యంలో హైకోర్టులో 9250/2024 ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తి పనులను ఎక్కడికక్కడే నిలిపి వేయాలని స్టే విధించారు. ప్రతివాదులైన రైల్వే శాఖ అధికారులు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. పనులు నిలిచి పోవడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.



పాత తాండూరులో నిలిచిన రైల్వే బ్రిడ్జి పనులు

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

ముగ్గురు జూదరుల అరెస్టు



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై ఇబ్రహీంపట్నం పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మారయ్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని పోచారం గ్రామంలో పులకంటి రణవీర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఇందులో ముగ్గురు జూదరులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.6,500 నగదు, 4 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈదురుగాలులకు పంట నష్టం

ఆందోళనలో అన్నదాతలు

ధారూరు: ఎండ, వానలు రైతులను కలవరపెడుతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వానలు రైతుల కునుకు లేకుండా చేస్తున్నాయి. వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభించనున్న తరుణంలో ప్రకృతి ప్రకోపంతో పంట చేతికి వస్తుందా లేదా అని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు వరి కోతలు చేసి ధాన్యం ఆరబెడితే అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్నాయి. 90 శాతం సేకరించకుండా ఉన్న వరి పొలాలు ఈదురుగాలులకు పైరు నేలకొరుగుతోంది. మండల పరిధిలోని గురుదోట్ల, పులిచింతమడుగుతండాలో యాసంగిలో సాగుచేసిన వరిపంట ఈదురు గాలులు నష్టం చేకూర్చాయని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బాల్యానాయక్‌కు చెందిన వరి పొలంపై వడగండ్ల వాన కురువడంతో గింజలు రాలాయి. పీసీఎంతండా, గురుదోట్లకు చెందిన పుల్యానాయక్, కూబ్యానాయక్, రాములు నాయక్, సూర్యానాయక్, తుల్సిరాం, పరశురాం, హన్మంత్, చందర్, బాణ్యానాయక్, గంగ్యానాయక్, కిష్ట్యానాయక్ తదితర రైతుల 50 ఎకరాల వరి పొలాలు దెబ్బతిన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.



ధారూరు: పీసీఎం తండాలో నేలకొరిగిన వరి పైరు

బీజేపీతోనే పేదలకు మేలు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతరెడ్డి

మీర్‌పేట: బీజేపీ మేనిఫెస్టో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీత రెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బీజేపీ క్వార్టర్స్‌లో మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆవాస్ యోజన పథకం కింద 33 శాతం మైనార్టీలకు ఇళ్లను నిర్మించినట్లు గుర్తుచేశారు. దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లి 25 కోట్ల మందిని పేదరికానికి దూరం చేశారన్నారు. ఆయూష్మాన్ భారత్, ముద్రలోన్‌లు, మేకిన్ ఇండియా, వికసిత్ భారత్, విశ్వకర్మ వంటి పథకాలతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు ఇచ్చిన ఘనత సైతం మోదీకే దక్కుతుందన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రధాని సారథ్యంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రణాళికతో వాటిని పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, నర్సింహ, గోవర్ధన్‌రెడ్డి, శివపార్వతి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న సంగీతరెడ్డి

బీజేపీతోనే దళితుల అభివృద్ధి

షాద్‌నగర్‌రూరల్: దేశంలో దళితుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. మంగళవారం పాలమూరులో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా ఆత్మీయ సమ్మేళనానికి సీనియర్ నాయకుడు ఎంకనోళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అందె బాబయ్య జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దళితులను ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే దళితుల జీవన విధానంలో మార్పు వచ్చిందన్నారు. దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాబోయే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింలు, కృష్ణయ్య, నర్సింలు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలరక్ష భవన్‌లో బాలిక

అనంతగిరి: వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన బాలికను ఆర్‌పీఎఫ్ సిబ్బంది మంగళవారం సీడబ్ల్యూసీ ప్రతినిధులకు అప్పగించారు. బాలిక తన పేరు బాల్లడిగి శరణమ్మ, తండ్రి హన్మంత్ అని.. తమది వాడి ప్రాంతమని చెప్పినట్లు తెలిపారు. బాలిక వయస్సు 13 సంవత్సరాలు ఉంటుందని, ఆమె ప్రస్తుతం వికారాబాద్ బాలరక్ష భవన్‌లో ఉందన్నారు. బాలికకు సంబంధించిన కుటుంబీకులు ఎవరైనా ఉంటే.. సరైన ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు. వివరాలకు 9948081999లో సంప్రదించాలని సూచించారు.



బాలికను సీడబ్ల్యూసీకి అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

ధర్మాన్ని కాపాడేందుకే శోభాయాత్ర



చిలుకూరులో శోభాయాత్ర ప్రారంభిస్తున్న అర్చకుడు రంగరాజన్

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: ధర్మాన్ని రక్షించేందుకే హనుమాన్ శోభాయాత్ర చేపడుతున్నామని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి మొయినాబాద్‌లోని హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. చిలుకూరులో అర్చకుడు రంగరాజన్ ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాముని సేవ చేస్తూ ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ధర్మాన్ని కాపాడాలనే ఏటా హనుమాన్ జయంతి రోజున శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ ధర్మ ప్రచార ప్రముఖ్ కృష్ణారెడ్డి, భజరంగ్‌దళ్ నేత నందు, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, మహేష్‌చారి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కందుకూరు: హనుమాన్ భక్తులతో ముస్లింలు

మత సామరస్యం చాటిన ముస్లింలు

కందుకూరు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ముస్లింలు మతసామరస్యాన్ని చాటారు. మంగళవారం మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసిఫ్‌జానీ, ఎండీ ఇలియాస్, ఎండీ పర్వేజ్ శ్రీశైలం రహదారిపై శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు జ్యూస్ ప్యాకెట్లు, తాగునీరు అందించారు. ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ మక్బూల్‌జానీ, ఎస్‌ఐ శ్రావణ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, నాయకులు వెంకటేష్‌గౌడ్, రాజేందర్, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ ఉత్తి మాటలే..

మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్ హామీలన్నీ ఉత్తుత్తి మాటలేనని మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక ఉచిత హామీలు ఇచ్చిందని, అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అహర్నిషలు శ్రమించి అభివృద్ధి చేశారని అన్నారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థి నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, నాయకులు దూదిమెట్ల బాల్‌రాజ్, రాజావరప్రసాద్, ఈట గణేశ్, రాంబల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

కొందుర్గు: తెలంగాణ అభివృద్ధిలో నాటికి, నేటికీ ఎలాంటి తేడా ఉందో ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే లోక్‌సభ ఎన్నికల్లో అధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుపొందాలని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరును ఐదు జిల్లాలుగా విభజించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మహబూబ్‌నగర్ మాజీ జెడ్పీ చైర్మన్లు నవీన్ కుమార్ రెడ్డి, ఈట గణేశ్, బీఆర్ఎస్ నేతలు రామకృష్ణా రెడ్డి, నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల దృష్ట్యా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును ఆదిబట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 12 వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.25 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న డ్రైవర్ మహ్మద్ ఇక్బాల్, కిందొడ్డి సునీల్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. రెడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు చెందిన డబ్బుగా పోలీసులు గుర్తించారు. ఏటీఎంలలో వేయడానికి తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నగదును గ్రీవియెన్స్ సెల్‌కు తరలిస్తామని సీఐ వివరించారు.